
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 14 ఆగస్టు 2024



ఊరిస్తున్న మార్కెట్ కమిటీలు



- పెండింగ్‌లో ఏడు పాలకవర్గాల నియామకాలు
- రిజర్వేషన్ల ప్రకారమే చైర్మన్ పదవులు
- నెలరోజుల్లో నియామకాలకు కసరత్తు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలను ఎప్పుడు నియమిస్తారా అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎదురుచూస్తున్నారు. రిజర్వేషన్ల ప్రాతిపదికనే రొటేషన్ పద్ధతిలో ఆయా కమిటీల చైర్మన్ పదవుల కోసం పలువురు ఆశావహులు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఆశీస్సుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో నెల రోజుల్లోపు జిల్లాలో ఖాళీగా ఉన్న మార్కెట్ కమిటీల పాలక వర్గాలను నియమించాలని మంత్రి, ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ఆయా జిల్లాల్లో పాలకవర్గాల నియామకాలు జరుగుతున్నాయి. జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, మంథని, కమాన్‌పూర్, రామగుండం, ధర్మారంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇందులో ధర్మారం మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమించినప్పటికీ, ఇంకా కొత్త పాలక వర్గం కొలువుదీర లేదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మార్కెట్ కమిటీలకు ఎలాంటి రిజర్వేషన్లు లేవు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ మార్కెట్ కమిటీల నియామకాలకు సంబంధించి నూతన విధానాలను తీసుకువచ్చింది. చైర్మన్ల నియామకాలకు సంబంధించి రిజర్వేషన్లను అమల్లోకి తీసుకువచ్చారు. పురుషులు, మహిళలకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, ఓసీలకు రొటేషన్ విధానాన్ని అమలు చేయాలని జీవో జారీ చేసింది. ఒకేసారి ఐదు టర్ములకు కలిపి రిజర్వేషన్లను ప్రకటించారు. మార్కెట్ కమిటీల పదవీ కాలం మొదట ఏడాది మాత్రమే ఉండగా, ఆ తర్వాత 2022లో రెండేళ్లకు పెంచడం గమనార్హం. పదవీకాలం ఏడాది ఉన్న వాళ్లకు మాత్రం ఆరు నెలల చొప్పున పదవీ కాలాన్ని రెండు, రెండున్నర సంవత్సరాల పాటు పొడిగించిన సందర్భాలు కూడా ఉన్నాయి.

గడిచిన ఏడాది నవంబరు నెలాఖరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టింది. అప్పటి వరకు ఉన్న మార్కెట్ కమిటీలన్నింటినీ రద్దు చేసింది. ఈ పదవులపై అనేక మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు ఆశలు పెంచుకున్నారు.

● నేతల చుట్టూ ప్రదక్షిణలు

మార్కెట్ కమిటీల పాలకవర్గాలకు రిజర్వేషన్లు అమలు చేస్తుండడంతో ఆయా వర్గాల్లో పదవులకు పోటాపోటీ నెలకొన్నది. పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి, సుల్తానాబాద్ కమిటీ చైర్మన్ పదవి జనరల్ కేటగిరీకి, జూలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ సామాజిక వర్గానికి, కాల్వశ్రీరాంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు, ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్టీలకు, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు, రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారికి కేటాయించారు. ఈ దఫా ప్రత్యేకించి మహిళలకు రిజర్వేషన్ దక్కలేదు. జనరల్ కేటగిరీలో పురుషులకు గానీ, మహిళలకు గానీ చైర్మన్ పదవి ఇవ్వవచ్చు. ధర్మారం కమిటీ పాలకవర్గాన్ని నియమించగా, ఇంకా ఏడు మార్కెట్లకు కమిటీలను నియమించాల్సి ఉంది. పెద్దపల్లి మార్కెట్ కమిటీ ఎస్సీలకు కేటాయించగా చైర్మన్ పదవిని ఈర్ల స్వరూప పేరును ఖరారు చేసినట్లుగా తెలుస్తున్నది. సుల్తానాబాద్ నుంచి దామోదర్ రావు, మినుపాల ప్రకాశ్‌రావు, అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్ చైర్మన్ పదవులను ఆశిస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ కమిటీ చైర్మన్ పదవి కోసం రామిడి తిరుపతిరెడ్డి, జిన్నా రాంచంద్రారెడ్డి, కాసర్ల మల్లయ్య, సబ్బని రాయమల్లు, ఎండీ మునీర్, ఎండీ సజ్జు, దొనికెన మొగిలి, ఓరుగంటి కొమురయ్యగౌడ్ ఆశిస్తున్నారు. జూలపల్లి నుంచి గండు సంజీవ్, బొజ్జ శ్రీనివాస్, పొట్యాల శంకర్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. జనరల్ స్థానాల్లో ఇతరవర్గాలకు అవకాశం ఉన్నప్పటికీ, ఆయావర్గాలకే చైర్మన్ పదవులు కట్టబెట్టాలని ఎమ్మెల్యే విజయరమణారావు భావిస్తున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. మంథని నుంచి శశిభూషణ్ కాచె ఉప్పట్ల శ్రీనివాస్, సంతోషిణి, ముస్కుల సురేందర్‌రెడ్డి, మూల పురుషోత్తం రెడ్డి, సరోజన, కమాన్‌పూర్ నుంచి తొట్ల తిరుపతి యాదవ్, గంటల వెంకటరమణారెడ్డి, ఇనగంటి భాస్కర్ రావు, పీట్ల గోపాల్, ఇనగంటి రామారావు, కోలేటి మారుతి, పైనాల రాజు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను ఆశిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. రామగుండం మార్కెట్ చైర్మన్ పదవి కోసం ఉరిమెట్ల రాజలింగం, వేల్పుల రాజుకుమార్, తదితరులు పోటీ పడుతున్నారు. పదవులు ఆశిస్తున్న నాయకులు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నెల రోజుల్లోపే మార్కెట్ కమిటీ పాలకవర్గాలను నియమించేందుకు మంత్రి, ఇద్దరు ఎమ్మెల్యేలు కసరత్తు చేస్తున్నారు.

మహిళల భద్రత కోసమే షీ టీమ్స్

మంథని, ఆగస్టు 13: మహిళల భద్రత కోసమే షీ టీమ్స్ ఏర్పాటు చేశారని షీ టీమ్ సభ్యులు అన్నారు. స్థానిక ప్రభుత్వ గర్ల్స్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్ పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా సెల్ నెం. 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు, లోన్ యాప్స్ గురవుతున్నారని, వాటికి జోలికి పోకుండా ఉండాలన్నారు. ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 100కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 1930 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గాంధీ, పీటీం సిబ్బంది స్నేహలత, సురేష్, మంథని పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

ఎలిగేడు, ఆగస్టు 13: మండలంలోని శివపల్లిలో లబ్ధిదారుడికి వైద్యఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే విజయరమణారావు మంగళవారం ఎల్‌వోసీని అందజేశారు. జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన శ్రావణ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. శ్రవణ్ ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.75,000వేల ఎల్‌వోసీని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన

సుల్తానాబాద్, ఆగస్టు 13: ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్, స్కూల్ డైరెక్టర్ కృష్ణప్రియ, వల్స నీలయ్య, శ్రీనివాస్ తదితరులు అవయవ దానం గురించి విద్యార్థులకు వివరించారు. అవయవ దానం చేయాల్సి ఆవశ్యకాన్ని వారు తెలియజేశారు.

బీసీల ఐక్యతతోనే భవిష్యత్ తరాలకు మేలు

- 20న బీసీ సదస్సును విజయవంతం చేయాలి - మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

పెద్దపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కుల సంఘాలు, రాజకీయ సంఘాలకు అతీతంగా బీసీలంతా ఐక్యమైతే భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఈ నెల 20న ఎంబీ గార్డెన్‌లో తలపెట్టిన బీసీ సదస్సుకు సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్‌లను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలంటే ఒక్కతాటిపైకి రారని, కులాలుగా విభజింపబడి ఉన్నారని, కుల మత్తులో ఉన్నారనే అపోహలు ఉన్నాయని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీసీలంతా సమష్టిగా ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో బీసీ సదస్సు పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. కుల సంఘాలు, రాజకీయ సంఘాలు కాకుండా కేవలం బీసీ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ సదస్సుకు కుల సంఘాలు, రాజకీయ పార్టీలోని ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు హాజరు కావాలని ఆయన అన్నారు. ఆనాడు బీపీ మండల్ కమిషన్ అమలై ఉంటే ఈనాడు మన తలరాతలు మారేవని ఆయన వివరించారు. బీసీ కులగణన జరగాలని అందరూ ముందుకు వచ్చారని, ముఖ్యంగా బీజేపీ నాయకులు సైతం కొన్ని చోట్ల ఆందోళనలు చేస్తున్నారని అన్నారు. అలాంటి వారి ఆందోళనలకు ఇక్కడికే పరిమితం కాకుండా కేంద్రానికి చేరాలన్నారు. అయితే ఎదిగిన కొద్ది మరిన్ని ఆశల కోసం ముందుకు పోతున్నామని, మనతోటి వాళ్ల కోసం మన మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడ అవకాశం వస్తే అక్కడ బీసీ ఐక్యతను చాటి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 20న నిర్వహించే బీసీ సదస్సుకు జిల్లాలోని బీసీలంతా హాజరై విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కౌశిక్ హరి, రఘువీర్ సింగ్, గంట రాములు యాదవ్, శిలారపు పర్వతాలు యాదవ్ దాసరి ఉష, మారం తిరుపతి యాదవ్, నల్లవెల్లి శంకర్, పూదరి సత్యనారాయణ, ఏగోళపు శంకర్ గౌడ్, బల్లబత్తుల నారాయణ, శంకర్ లాల్, బండారి శ్రీనివాస్ గౌడ్, నూనెటి సంపత్ యాదవ్, కలవరి శ్రీనివాస్, ఆకుల స్వామి వివేక్ పటేల్, రామగిరి చంద్రమౌళి, బొడ్డుపల్లి రామ్మూర్తి, మేడగొని శ్రీకాంత్ గౌడ్, లైసెట్టి బిక్షపతి, ముత్యాల లక్ష్మణ్ గౌడ్, శిరవేణ లవన్ కుమార్, సలేంద్ర కొమురయ్య, భూమేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, తదితరులు

ఆయుష్ వైద్య శిబిరానికి స్పందన

ఓదెల, ఆగస్టు 13 : మండలంలోని పొత్కపల్లి లో మంగళవారం నిర్వహించిన ఆయుష్ వైద్య, చికిత్స శిబిరానికి మంచి స్పందన లభించింది. ఇక్కడ జ్వరాలు, కీళ్లనొప్పులతో గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతుండడంతో జ్వరం, దగ్గు, ఆయాసం, జీర్ణ సంబంధ వ్యాధులకు అలాగే అర్షమొలలు, మూత్ర, చర్మ, వెన్ను నరాల నొప్పులకు సంబంధించిన ఆయుర్వేద మాత్రలను అందజేశారు. డా.ప్రభాకర్ మాట్లాడుతూ ఆహార నియమాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఎలాంటి ఇన్ఫెక్షన్, ప్రమాదం లేని ఆయుర్వేద మందులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోత్కపల్లి తో పాటు వివిధ గ్రామాలకు చెందిన 150 మంది గ్రామస్తులకు వివిధ వ్యాధులకు మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ తిరుపతి, గ్రామపంచాయతీ కార్యదర్శి కుమారస్వామి, ఆయుష్ మేనేజర్ విద్యాసాగర్, సుధాకర్, లక్ష్మణ్, రాజమల్లు, లచ్చయ్య, శివలీల వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లిలో వైద్య శిబిరం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 13: మండలంలోని పెగడపల్లిలో మంగళవారం వైద్య శిబిరం జరిగింది. కునారం ప్రభుత్వాసుపత్రి డాక్టర్ భావన గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సుమారు 93మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 10మంది వద్ద రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మణ్, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, ఆరోగ్య సహాయకులు విజయ, శోభ, గ్రామ కార్యదర్శి శంకర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్స్ పంపిణీ

ముత్తారం, ఆగస్టు 13: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు మాధవ సేవ సమితి ఉమ్మడి కరీంనగర్ వారి ఆధ్వర్యంలో 200 ప్లేట్లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాధవసేవ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మాధవరావు, కళాశాల ప్రిన్సిపాల్ కమల, ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు జంగాపెల్లి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల వ్యాప్తి అరికట్టేందుకు చర్యలు

- నీరుకుల్ల, గట్టేపల్లిలో ఇసుక రీచ్‌ల ఏర్పాటు
- అప్రోచ్ రోడ్డు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- సుల్తానాబాద్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష విస్తృత పర్యటన

సుల్తానాబాద్, ఆగస్టు 13: సీజనల్ వ్యాధులు వ్యాప్తి అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కోమ శ్రీహర్ష తెలిపారు. సుల్తానాబాద్ మండలంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలను, మానేరులో నూతనంగా ఏర్పాటు చేయబోయే ఇసుక రీచ్‌లను, తహసీల్దార్ కార్యాలయాన్ని, సుల్తానాబాద్ ప్రజలకు సరఫరా అయ్యే మంచినీటి బావిని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇదే విధంగా వ్యాధులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కలెక్టర్ తొలుత నీరుకుళ్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తరగతి గదులను, పాఠశాల ప్రాంగణం రెగ్యులర్‌గా శుభ్రం చేయాలని సూచించారు. గట్టేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, వారికి నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ సూచించారు.

● రోడ్ల పక్కన అవెన్యూ ప్లాంటేషన్

మండలంలోని నీరుకుళ్ల, గట్టేపల్లితో పాటు పలు గ్రామాల్లో నిర్మించిన నూతన రోడ్లకు ఇరుపక్కలా పెద్ద ఎత్తున మొక్కలతో అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొత్తగా రోడ్ల నిర్మాణం చేపట్టిన తర్వాత వాటికి ఇరువైపు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని మొక్కలు సంరక్షించుకోవాలని అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని మానేరు పరివాహక ప్రాంత గ్రామాల్లో కొత్తగా ప్రభుత్వం ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో బాగంగా నీరుకుళ్ల గట్టేపల్లి మానేరు వాగులను ఇసుక రీచ్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక రవాణ కోసం అనువుగా అప్రోచ్ రోడ్ల నిర్మాణం కోసం కొత్తగా ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



సుల్తానబాద్‌లో మంచినీటి బావిని పరిశీలిస్తున్న కలెక్టర్

● తాగునీటి బావి పరిశీలన..

సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే బావిని కలెక్టర్ పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డు అశోక్ నగర్‌లో ఉన్న మంచినీటి బావిలో మురికినీరు వరద నీరు కలుస్తుందని పలువురు స్థానికులు తెలపగా కలెక్టర్‌తో కలసి సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు బావి వద్దకు వెళ్లి బావి నీటిని పరిశీలించారు. బావిలో నీరు కొంత రంగు మారడంతో కలుషిత నీరు కలువకుండా శాశ్వత పరిష్కారం చూపాలని చైర్‌పర్సన్ కలెక్టర్‌ను కోరారు. సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని చైర్‌పర్సన్ తెలిపారు.

సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ మేరకు సుల్తానాబాద్ మండల పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను ఆయన ఆన్‌లైన్‌లో పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డితో పాటు ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, పంచాయతీరాజ్ ఏఈ సచిన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● పెద్దబొంకూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దబొంకూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఆకర్షణకు ఏర్పాటు చేసిన పెయింటింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, సీడీపీవో కవిత తదితరులు ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఎస్‌టీపీపీలో అక్రమ కట్టడాల కూల్చివేత

- 163 నిర్మాణాల తొలగింపు



నిర్మాణాలను కూల్చివేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది 8

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- డైరెక్టర్ (పా, ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్ 8

అధ్వానంగా పాఠశాల మైదానం

- విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు



బురదతో నిండిపోయిన ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 13: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల మైదానం అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని బాయ్స్ హైస్కూల్, ఉర్దూ మీడయం, ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు ఒకే ప్రాంగణంలో కొనసాగుతున్నాయి. సుమారు ఆరువందల మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న శిథిలావస్థలో ఉన్న పాత భవనాన్ని కూల్చి వేశారు. ఈ శిథిలాలతో పాఠశాల ఆవరణలో ఉన్న మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మైదానాన్ని మొరం మట్టితో బాగు చేయాల్సి ఉంటుంది. చదునుగా ఉన్న మైదానంలో భవన శిథిలాలతో మొత్తం మైదానాన్ని నింపివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రౌండ్ బురదగా మారి విద్యార్థుల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పాఠశాల ఆరంభంలో ప్రార్థన చేయలేని పరిస్థితి ఉంది. పిల్లలు తీసుకువచ్చిన సైకిళ్లు, టీచర్లు తెచ్చుకున్న వాహనాలు పాఠశాల బయటే పార్కింగ్ చేస్తున్నారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మైదానంలో కనీసం జెండా ఎగురవేసే పరిస్థితి కనబడడం లేదు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఫాతిమాను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా పాత భవనం కూల్చి వేసిన శిథిలాలను మైదానంలో వేసి బాగు చేద్దామని అధికారులు నిర్ణయం తీసుకున్నారన్నారు. వర్షాల కారణంగా గ్రౌండ్ ఇలా తయారైందని, రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.



బురదలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్

పెద్దపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15వ తేదీన జరిగే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారద హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇక్కడి వేడుకలకు హాజరవుతారని అంతా భావించారు. ఆయనకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే అవకాశం కల్పించారు. అలాగే జిల్లాకు చెందిన ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు మంచిర్యాల జిల్లాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ గదుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రామగుండం మండల కార్యాలయం సమీపంలో ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన గదుల అద్దె కోసం ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, రామగుండం మండల పరిధిలో గల షెడ్యూల్ కులాలకు చెందిన వాళ్ల జీవనోపాధి కోసం ఏదైనా వ్యాపారం నిర్వహించుకునేందుకు వీలుగా షట్టర్లను అద్దెకు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. 17వ తేదీ వరకు దరఖాస్తులను కలెక్టర్ కార్యాలయంలో గల ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 13: ఒంటిరితనంతో పాటు అనారోగ్య సమస్యలు భరించలేక వృద్ధుడు కొప్పు శంకర్ (72) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన శంకర్ తన భార్య పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉండేవారు. భార్యాపిల్లలతో గొడవ పడి 20 ఏళ్ల కిందట శంకర్ తన స్వగ్రామానికి వచ్చి చిన్నపాటి రేకుల షెడ్డులో ఒంటరిగా జీవిస్తున్నాడు. గ్రామంలో పశువుల కాపరిగా కొనసాగుతుండేవాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన శంకర్ ఒంటరితనం, అనారోగ్యం వల్ల మనస్తాపం చెంది రేకుల షెడ్డులో ఉరివేసుకుని చనిపోయాడు. ఇంటిలో నుంచి దుర్వాసన రావడంతో చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. విషయం తెలుసుకున్న మృతుడి భార్య హన్మవ్వ గ్రామానికి చేరుకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.



వేణుగోపాల్ రెడ్డి

ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవానికి ఆహ్వానం

వీణవంక, ఆగస్టు 13: న్యూఢిల్లీలో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనాలని మండలంలోని ఘన్ముక్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పదో తరగతి విద్యార్థి బావు శ్రీశాంత్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. రాష్ట్రంలోని ఐదుగురు ఉపాధ్యాయులు, ఐదుగురు విద్యార్థులకు అవకాశం దక్కింది. వీరు మూడు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించి కేంద్ర విద్యాశాఖ మంత్రితో సమావేశంలో పాల్గొంటారు. ఎంపికైన వారిని మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి, సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్, డీఈవో జనార్దన్‌రావు అభినందించారు.



బావు శ్రీశాంత్

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, ఆగస్టు 13: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమతి లేకుండా మానేరు వాగు నుంచి ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్ తరలించారు. పోతిరెడ్డిపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్ చెవుల అనిల్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

అప్పుల బాధతో వృద్ధుడి ఆత్మహత్య

బోయినపల్లి, ఆగస్టు 13: అప్పులు తీర్చే మార్గం లేక ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం కోరెం గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై పృథ్వీదర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్కాపురం రాజయ్య (60) తన ఇద్దరు కుమారులను ఉపాధి కోసం గల్ఫ్‌కు పంపించాడు. వారిద్దరూ అక్కడ సరైన జీతం లేకపోవడంతో ఇంటికి వచ్చారు. అంతే కాకుండా రాజయ్య కుమార్తె వివాహానికి అప్పు చేశాడు. గల్ఫ్ అప్పులు, కుమార్తె పెళ్లికి చేసిన అప్పులు పెరగడంతో రాజయ్య తీవ్ర మనస్థాపానికి గురైనట్లు తెలిపారు. సోమవారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి గ్రామ శివారులో ఉన్న కొండపోచమ్మ వద్ద ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాఖీ పౌర్ణమికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

భగత్‌నగర్, ఆగస్టు13: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఆర్టీసీ అదనపు బస్సులు నడిపించనున్నట్లు ఆర్ఎం ఎస్.సుచరిత అన్నారు. మంగళవారం కరీంనగర్ బస్ స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో రీజియన్ పరిధిలోని అన్ని డిపోల మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహాలక్ష్మి పథకం అమలు, ఈనెల 19న రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు ఈనెల 14న 83 బస్సులు, 16న 58 బస్సులు, 17న 145 బస్సులు మొత్తం 286 బస్సులు నడిపించనున్నామన్నారు. కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు 19న 150 బస్సులు, 20న 150 బస్సులు, 21న 140 బస్సులు మొత్తం 440 బస్సులు కలుపుకుని మొత్తం 726 బస్సులు నడిపించేందకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితమైన ప్రయాణం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటి రీజినల్ మేనేజర్స్ (మెకానికల్, ఆపరేషన్స్) కె.సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, అన్ని డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడిపై కుక్క దాడి


చెవికి గాయంతో బాలుడు

చందుర్తి, ఆగస్టు 13 : అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగు సంవత్సరాల బాలుడిపై కుక్క దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం బండపల్లి గ్రామంలోని ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కటకం హరిత తన కుమారుడైన ఆరుష్‌ను మంగళవారం ఉదయం అంగన్‌వాడీకి పంపించింది. ఆరుష్‌తో పాటు మరో బాలుడిని మూత్ర విసర్జన కోసం ఆయా లచ్చవ్వ మూత్రశాల వద్దకు తీసుకువెళ్లింది. బాలుడు మూత్రశాల డోర్ తీసి లోపలికి వెళ్లగానే, అందులోనే ఉన్న కుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసింది. ఈ సంఘటనలో బాలుడి చెవి భాగంలో తీవ్ర గాయమైంది. బాలుడి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మొదట వేములవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సిరిసిల్ల ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అంగన్‌వాడీలో కుక్క దాడి చేయడంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

గూడెంలో చిన్నారులపై..

ఓదెల: మండలంలోని గూడెంలో మంగళవారం కుక్కల గుంపు స్వైర విహారం చేసి పలువురిపై దాడికి పాల్పడ్డాయి. దీంతో రేగుల ఈశ్వర్ ప్రసాద్, రేగుల వినయ్ అనే చిన్నారుల పొట్టల్లో, చేతులకు గాయాలయ్యాయి. సోమవారం రాత్రి కూడా ఇళ్లలో నుంచి బయటికి వచ్చిన పలువురిపై కుక్కల గుంపు ఆకస్మాత్తుగా దాడి చేసి మరో అయిదుగురు వ్యక్తులను నోట కరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామస్తులు రాత్రింబవళ్లు బయటకు రావాలంటే భయందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నివారణ చర్యలు చేపట్టి, గాయాలకు గురైన వారికి గ్రామంలోని వైద్య చికిత్సలు అందించాలని కోరారు.

కథలాపూర్‌లో టెలికాం కేబుల్ చోరీ

కథలాపూర్, ఆగస్టు 13 : మండల కేంద్రంలో మంగళవారం టెలికాం శాఖకు చెందిన కేబుల్‌ను కొందరు వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వరద కాలువ పక్కన నుంచి గతంలో భూష ణరావుపేటకు టెలిఫోన్ సదుపాయం కల్పించేందుకు ఈ కేబుల్ వేశారు. అయితే సుమాజుజీ ఐదుగురు వ్యక్తులు తాము టెలికాం విభాగానికి చెందిన వారమని పేర్కొంటూ కేబుల్ కోసుకు వెళ్లారు. ఈ క్రమంలో అటువైపు వెళ్లే పలువురు రైతులు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసులు సంబంధిత అధికారులకు సమాచారం అందించగా ఎస్‌డీఈ చిన్నయ్య, జేటీవో అశోక్‌కుమార్, లైన్‌మెన్ సంఘటనా స్థలంకు చేరుకున్నారు. వరద కాలువ వెంబడి కోసిన కేబుల్‌ను దాచి ఉంచినట్టు కనిపెట్టారు. సుమారు వంద మీటర్ల మేర రూ. 60 వేల విలువైన కేబుల్ కోసి వేసినట్టు అధికారులు అంచనాకు వచ్చారు. పోలీసులు కేబుల్‌ను చోరీ చేసిన దొంగలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

బకాయిలు వసూళ్లపై దృష్టి సారించాలి

రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం



సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాహనదారుల నుంచి రావాల్సిన పన్నుల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం సూచించారు. మంగళవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైమాసిక పన్నులను సకాలంలో చెల్లించే విధంగా వాహన దారులకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిలో యువకులే ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రమాదాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అద్దె భవనంలో ఉన్న కార్యాలయం అనువుగా లేదని వాహనాదారులు తమ దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. కార్యాలయాన్ని అన్ని సౌకర్యాలతో ఉండే భవనంలోకి మారుస్తామని తెలిపారు. తనిఖీల్లో జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య


రాజేందర్(ఫైల్)

మెట్‌పల్లి , ఆగస్టు 13 (ఇబ్రహీంపట్నం): పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో మంగవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన బాలి రాజేందర్(48) అనే వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజేందర్ బోధన్ పట్టణంలో 11 సంవత్సరాలుగా సిమెంట్, ఇనుము వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. సోమవారం బోధన్ నుంచి కోరుట్లలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి కావడంతో ఇంటికి వెళ్లలేక పట్టణంలోని ఓ లాడ్జిలో గది తీసుకున్నాడు.

మంగళవారం ఉదయం 3 గంటల సమ యంలో ఓ వాట్సప్ గ్రూప్‌లో, తన భార్య శిరీషకు ఆర్థిక ఇబ్బందుల వల్ల తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మెసేజ్ పంపాడు. అప్రమత్తమైన కు టుంబ సభ్యులు, స్నేహితులు 100 కాల్‌తో పాటు మెట్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు లాడ్జికి వెళ్లి చూసేసరికి రాజేందర్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాజేందర్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే తనను ఇద్దరు మోసం చేశారని, 15 సంవత్సరాలుగా డబ్బులు ఇస్తానని ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆ ఇద్దరి వల్లే తనకు ఈ పరిస్థితి వచ్చిందని ఇద్దరు పేర్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. అదే విధంగా పలు యాప్‌లలో భార్యకు తెలియకుండా లోన్లు తీసుకున్నాడని వాటి ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తన కూతురు, కొడుకును స్నేహితులు ఆదుకుని ఉన్నత చదువులకు సహకారం అందించాలని అందులో కోరాడు. వ్యాపారి రాజేందర్‌ది స్వస్థలం మల్లాపూర్ మండలం మొగిలిపేట కాగా 15 ఏళ్ల క్రితమే బోధన్ వెళ్లి అక్కడే స్థిరపడినట్లు స్నేహితులు తెలి పారు. భార్య శిరిష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. మృతుడికి ఎంత అప్పు ఉన్నాదనేది పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిడ్‌మానేరుకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 13: రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి 17వ రోజు నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం 3,150 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 13.8 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 312.79 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు 16.20 టీఎంసీలు ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

డెంగ్యూతో వ్యక్తి మృతి


సంపత్‌రావు (ఫైల్)

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 13: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మెహర్ నగర్‌కు చెందిన వాటర్ ప్లాంట్ యజమాని జూపల్లి సంపత్‌రావు (42) మంగళవారం డెంగ్యూతో మృతి చెందాడు. తంగళ్లపల్లి మండలం వేణుగోపాల్‌పూర్ గ్రామానికి చెందిన సంపత్‌రావు దాదాపు 23 సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం సిరిసిల్ల పట్టణం వచ్చి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. మెహర్‌నగర్‌లో వాటర్‌ప్లాంట్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం తీవ్ర జ్వరం రావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా డెంగ్యూ అని తేలింది. ప్లేట్‌లెట్స్ చాలా వరకు తగ్గిపోవడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ: ఇద్దరికి గాయాలు

గంభీరావుపేట, ఆగస్టు 13: మండల కేంద్రానికి సమీపాన రైస్‌మిల్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మల్లారెడ్డిపేటకు చెందిన కందుకుల నవీన్, నర్మాలకు చెందిన ద్యానబోయిన సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. మల్లారెడ్డిపేట నుంచి నవీన్ గంభీరావుపేట మండల కేంద్రానికి వస్తుండగా, లింగన్నపేట నుంచి మండల కేంద్రానికి వస్తున్న సురేష్ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన వీరిద్దరినీ ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్తంభాన్ని ఢీ కొట్టిన ట్రాక్టర్

డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో ప్రమాదం

మెట్‌పల్లి , ఆగస్టు 13(ఇబ్రహీంపట్నం): పట్టణంలోని చైతన్యనగర్‌లో మంగళవారం ఓ ట్రాక్టర్ డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్తంభం విరిగిపడింది. స్థానికుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన డ్రైవర్ చైతన్య నగర్ ప్రధాన విధి గుండా వెళ్తుండగా డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్‌కు హఠాత్తుగా ఫిట్స్ రావాడంతో ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం సగ భాగం విరిగి ట్రాక్టర్‌పై పడింది. గమ ణించిన స్థానికు లు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫర నిలిపి వేయడంతో ప్రాణాపాయం తప్పింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ట్రాక్టర్ డ్రైవర్‌ను స్థానికులు ప్రథమ చికిత్స అందించడంతో ప్రాణాలతో బయట పడ్డాడు.

గురుకుల పాఠశాలలో ఏసీబీ తనిఖీలు

అసౌకర్యాలపై ఆరుగంటలు పరిశీలన


గురుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, వంటశాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 13: సిరిసిల్ల పట్టణం పెద్దూరులోని ఇప్పలపల్లి మహాత్మజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సోదాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న అసౌకర్యాలపై ఏకకాలంలో ఏసీబీ, ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఇప్పలపల్లి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో దాదాపు 6 గంటల పాలు తనిఖీలు నిర్వహించారు. అద్దెభవనంలో ఉన్న ఈ పాఠశాలలో పరిశుభ్రత, ఆహారం, 356మంది విద్యార్థులకు సరిపడా సదుపాయాలను, హాస్టల్‌లో రికార్డులు పరిశీలించారు. వంటశాలలో ఆహార నిల్వలు, తయారీ, నిర్వహణ, రికార్డుల ప్రకారం విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాలలోని 19 మంది అధ్యాపకులు విద్యార్థులతో ఎలా ఉంటున్నారని ఆరా తీశారు. కాంట్రాక్టరు ప్రతిరోజు విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో నెలకొన్న స్థితిగతులపై అధ్యయనం చేసి రాష్ట్ర ఏసీబీ డీజీకి నివేదిక సమర్పిస్తామని ఏసీబీ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనూష, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సత్య నారాయణ, లీగల్ మెట్రాలజీ అధికారిణి భూలక్ష్మి, ఆడిటర్ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 13: స్థానిక సంస్థల ఎన్నికల పోటీకి సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ పెద్దపల్లి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం పెద్దపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కడారి సునీల్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాడ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని ఉసి గొలుపుతున్నదని, దేశ సమగ్రతకు ఐక్యతకు భంగం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి అడ్డగోలు షరతులు కండిషన్లు పెట్టి హామీల అమలుకు అడ్డుగా చూపెటవద్దన్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ రెండు లక్షల రూపాయలు పూర్తిగా తెల్లరేషన్ కార్డు లింక్ లేకుండా రైతుల పాస్‌బుక్ ఆధారంగా రైతుల రుణమాఫీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతు బంధును వెంటనే అమలు చేయాలని రైతుల పెట్టుబడులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెల్లరేషన్ కార్డులకు వ్యవసాయ భూములు మాగాని, చెలుక రకరకాల ఇబ్బం దులు పెట్టొద్దన్నారు. సెప్టెంబరు నెలలో జరగబోయే స్థానికసంస్థలు, సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, గోష్కి మోహన్, గౌతమ్ గోవర్ధన్, కే కనకరాజు టి మల్లయ్య కోడం స్వామి, గట్టయ్య, రాజమౌళి, పసుల మల్లారెడ్డి, ఆల శ్రీనివాస్‌రెడ్డి, ఓదమ్మ రమ, శంకర్, మానస్, ప్రీతం, టి లక్ష్మణ్, సీపీఐ అనుబంధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీపీలో అక్రమ కట్టడాల కూల్చివేత


కూల్చివేసిన నిర్మాణాలు

కోల్‌సిటీ, ఆగస్టు 13: రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మాల్కాపూర్ సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ)పాండ్‌లలో నిర్మించిన అక్రమ కట్టడాలను రామగుండం నగరపాలక సంస్థ మంగళవారం కూల్చివేసింది. 163 నిర్మాణాలను తొలగించింది. కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్, పారిశుధ్య సిబ్బంది ఈ తొలగింపు పనుల్లో పాల్గొన్నారు. మల్కాపూర్ ఎస్‌టీపీలో సీపీఎం ఆధ్వర్యంలో రెండేళ్లుగా భూ ఆక్రమణలు జరుగుతున్నాయి. దశలవారీగా 300లకుపైగా నిర్మాణాలు చేశారు. మొదట చీరలు, పాల్తిన్ షీట్లతో గుడిసెలు వేసి తరువాత రేకుల షెడ్లు నిర్మించారు. అమృత్ పథకంలో రామగుండానికి నిధులు మంజూరయ్యాయి. దీనిలో భాగంగా మల్కాపురం, రామగుండం పాములపేట, యైటింక్లయిన్‌కాలనీ, జనగామాల్లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం జరుగాల్సి ఉంది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. పనులు ప్రారంభించేందుకు స్థలాలను అప్పగించాలని ప్రజారోగ్యశాఖ నగరపాలక సంస్థకు లేఖ పంపింది. స్థలం సిద్ధంగా ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ లేఖ రాశారు. కాగా ఆ స్థలాల్లో కట్టడాలు ఉండడంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్మాణాల తొలగింపునకు నిర్ణయం తీసుకున్నారు. సోమవారం నగరపాలక సంస్థ అధికారులు, పోలీస్ అధికారులు పలు దఫాలుగా ఆక్రమణదారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న సీపీఎం నాయకులతో చర్చలు జరిపారు. గోదావరి జలాలు కాలుష్యం కాకుండా ఉండేందుకు ఎస్‌టీపీల నిర్మాణం తప్పనిసరి అని, అందులో నిర్మాణాలు చేయడమే సరికాదని, వాటి తొలగింపు అనివార్యమని, సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కూడా ఫోన్‌లో సీపీఎం నాయకులతో మాట్లాడారు. అర్హులైన పేదలకు మరో చోట అవకాశం కల్పిస్తామని, ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో మంగళవారం ఉదయం నిర్మాణాలను తొలగించారు. దీంతో ఎస్‌టీపీల నిర్మాణాలకు మార్గం సుగమమం అయ్యింది.

నిందితుడిని ఉరితీయాలి

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 13: కోలకతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితుడిని ఉరితీయాలని సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు కోరారు. సోమవారం రాత్రి సింగరేణి మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హిమబిందు మాట్లాడుతూ నిందితుడిని బహిరంగంగా ఉరి తీయాలని, ప్రజల కోసం సేవ చేస్తున్న వైద్యురాలిపై హత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి సైకిల్ అందజేత

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 13: రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గోదావరిఖని లయన్స్ భవన్‌లో పేద విద్యార్థి సూర్యతేజకు సైకిల్‌ను మంగళవారం అందజేశారు. సీనియర్ లయన్స్‌క్లబ్ సభ్యులు శరత్‌బాబు-పద్మజ కూతురు సంజు జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో పదోత రగతి చదువుతున్న పేద విద్యార్థి సూర్యతేజకు లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ ముద్దసాని ప్రమోద్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా సైకిల్‌ను అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.

అందరూ నేత్రదానం చేయాలి

-సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మాచారి


మాట్లాడుతున్న భీష్మాచారి

ఓదెల, ఆగస్టు 13: అవయవ, నేత్ర, శరీర దానాలతో అంధత్వం లేని సమాజాన్ని సాధించుకోవాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మాచారి అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్లో మంగళవారం అంతర్జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని సదాశివ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భీష్మచారి మాట్లాడుతూ, సమాజంలో ప్రాణాంతక వ్యాధులతో అవయవాలు దెబ్బతిని 15నిమిషాలకు ఒకరు చొప్పున అర్థాంతరంగా మరణిస్తున్నారని తెలిపారు. ఇలాంటి మరణాలను తగ్గించేందుకు బ్రెయిన్ డెడ్ అయినవారు అవయదానం చేయడమే మార్గమన్నారు. నేత్ర, అవయవ దానాలపై గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించడంతో ఇప్పటికి 180 నేత్ర, మూడు అవయవ, ఒకటి శరీర దానం చేసి వారు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మరణానంతరం ఉపయోగపడే నేత్ర, అవయవ, శరీరాలను మట్టిలో వృథా పోనీయకుండా దానం చేస్తే ఇతరులకు ఉపయోగపడి ధన్యజీవులు అవుతారని తెలిపారు. కరీంనగర్‌కు చెందిన ఒక ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహకుల ఆధ్వర్యంలో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, నరహరి రాజమల్లయ్య, క్యాతం మల్లేశం, ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం వెంగళ పద్మ, బండి శోభారాణి, అశోక్, సుమన్, రాజేందర్‌రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎలిగేడు, ఆగస్టు 13: మండలంలోని 12గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు మంద కృష్ణమాదిగ చేపట్టిన విజయోత్సవ ర్యాలీకి మంగళవారం తరలి వెళ్లారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి లక్షలాది జనంతో ర్యాలీగా ట్యాంక్ బండ్ వరకు ర్యాలీగా వెళ్లారు. హైదరాబాద్ తరలిన వారిలో ఎమ్మార్పీఎస్ ఎలిగేడు మండల అధ్యక్షుడు న్యాతరి పోచయ్య, ఉపాధ్యక్షుడు అనంపల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి జల్లి రమేష్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రాచర్ల కొండయ్య కవ్వంపల్లి ప్రభాకర్, బాసంపల్లి వినోద్, కవ్వంపల్లి బాపయ్య, బాసంపల్లి రాజేశం, బాసంపెల్లి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

మహిళ సంఘాల సభ్యులతో సమావేశం

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 13: మండలంలోని కాపులపల్లి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో అధికారులు మంగళవారం సమావేశం నిర్వహించారు. మూడేళ్ల క్రితం కాపులపల్లి గ్రామంలో 16 సంఘాలు ఉండగా అందులో కొన్ని సంఘాలు తీసుకున్న అప్పును బ్యాంకులో జమ చేయాలని సీఏకు ఇవ్వగా ఆమెతో పాటు సీఎస్పీ సెంటర్ ఇన్‌చార్జి ఇద్దరు కలిసి సుమారు రూ. 26 లక్షలను స్వాహ చేసినట్లు అధికారులు నిర్ధారించారు. స్వాహ చేసిన రుపాయలను రికవరీ చేసి వెంటనే తమ సంఘాలకు కొత్త రుణాలు ఇవ్వాలని సమావేశానికి వచ్చిన అధికారులకు విన్నవించారు. అధికారులు మాట్లాడుతూ మరోసారి సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

వన మహోత్సవంలో మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న చైరపర్సన్ రమ

మంథని, ఆగస్టు 13: వన మహోత్సవంలో భాగంగా స్థానిక శ్రీపాదకాలనీలో మున్సిపల్ చైర్‌పర్సన్‌పెంద్రు రమ-సురేష్‌రెడ్డి మంగళవారం మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటడం తోపాటు వాటి రక్షించడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ప్రజలను కోరారు. పచ్చదనం, పరిసరాల, వ్యక్తి శుభ్రతను పాటించాలని సూచించారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ గుండా విజయలక్ష్మి-పాపారావు తో కలిసి ఇంటింటికి పండ్ల మొక్కలు పూల మొక్కలు పంపిణీ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పాలకుర్తి, ఆగస్టు 13: మండలంలో పలువురు బాధిత కుటుంబాలకు కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక్ హరి, ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య పరామర్శించారు. బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనీలో ప్యాకింగ్ ప్లాంట్‌లో జనరల్ వర్క్స్ చేస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన కాంట్రాక్టు కార్మికుడు సనాతన్ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. పెద్దపల్లి మార్చు రిలో ఉన్న సనాతన్ మృతదేహాన్ని కౌశిక్ హరి, మాదాసు శ్రీనివాస్, సూర సమ్మయ్య సందర్శించారు. సనాతన్ మృతదేహాన్ని స్వరాష్ట్రం ఒడిషాకు పంపిం చాడానికి స్థానిక పోలీసులతో మాట్లాడి అన్నిఏర్పాట్లను చేయడంతో పాటు దహనసంస్కారాలకు అడ్వాన్స్ ఇప్పించారు. ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన బీసగోని సతీష్ అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సతీష్ సిమెంటు మిల్లులో కాంట్రాక్ట్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఆయన కుటుంబీకులను కలుసుకొని వారికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కాంట్రాక్టర్ తో మాట్లాడి దహన సంస్కారాలకు 25 వేల రూపాయలను ఇప్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 13: జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ విస్తరణ అధికారులతో తనిఖీ చేయించాలని, మారుమూల గ్రామాలు, సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గంజాయి మొక్కలు కనిపిస్తే పోలీసు, ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. అటవీ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో ఉన్న విద్యాసంస్థల్లో విద్యార్థుల అలవాట్లను పరిశీలించాలని, మాదక ద్రవ్యాల వాడకంవల్ల వచ్చే నష్టాలను వివరించాలని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా కాకుండా చెక్ పోస్టుల వద్ద పకడ్బందీ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య పెద్దపల్లి ఏసీపీ జి. క్రిష్ణ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్‌కుమార్, డ్రగ్స్ఇన్‌స్పెక్టర్ పి శ్రావణ్‌కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, డీఈవో డిమాధవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, జిల్లా రవాణా అధికారి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జనజాగరణను విజయవంతం చేయాలి

జ్యోతినగర్/సుల్తానాబాద్ ఆగస్టు 13: జాతీయ కార్మిక సంఘాల జాయింట్ ఫోరం, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న జనజాగరణను విజయవంతం చేయాలని రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఎన్టీపీసీలో ప్రచారం చేశారు. ఎన్టీపీసీ రెండోగేట్ వద్ద సీఐటీయూ శ్రేణులు కరపత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. సుల్తానాబాద్‌లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాక మహేష్ జనజాగరణ పత్రాలను ఆవిష్కరించారు.

కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ఉమ్మడి కూటమి దేశ వ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. బుధవారం ఎన్టీపీసీలో, సుల్తానాబాద్‌లో జనజాగరణ చేపడుతామని, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాకూబ్, రాఘవరెడ్డి, మల్లేశ్, కనకయ్య, హుస్సేన్‌రెడ్డి, సంపత్, నరేష్, రాజయ్య, శ్రీకాంత్, దేవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చెల్మారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పాలకుర్తి, ఆగస్టు 13: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పుట్నూర్ పీఎస్ వైద్యుడు సాయి సూర్య అన్నారు. మంగళవారం మండలం పరిధిలోని జయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పురుషోత్తం, ఏఎన్‌ఎం నగునూరి సరిత, పంచాయతీ కార్యదర్శి పెద్రు సాయిచరణ్, ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహ సంక్షేమ అధికారి మెండె సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

ముత్తారం, ఆగస్టు 13: సాధారణ బదిలీల్లో భాగంగా జడ్పీహెచ్‌ఎస్ ముత్తారం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు భోజనపల్లి లక్ష్మణ్‌కుమార్, లింగం శ్రీనివాస్, మంగ స్రవంతి, అనంతుల భాస్కర్, సయ్యద్ ఖాజాబీ. గౌర మంజుల, సురేష్, సీఆర్‌పీ సమ్మయ్యను విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముద్దసాని పద్మాదేవి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అమ్ము లావణ్య, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలతో భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 13: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖనిలో జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక రామగుండం కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్ వద్ద నుంచి విద్యార్థులు, యువతీ, యువకులతో జాతీయ జెండాలతో బయలుదేరిన ర్యాలీ ప్రధానచౌరస్తా వరకు భారత్‌మాతాకీ జై వందేమాతరం నినాదాలతో కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేరుగు హన్మంత్‌గౌడ్, క్యాతం వెంకటరమణ, కోమళ్ల మహేష్, కె సంజీవ్, కె రమేష్, భూమ్య, గోపగాని నవీన్, సతీష్, స్వామి, శ్రీనివాస్, టి నర్సయ్య, పిడుగు కృష్ణ, విశ్వాస్, పంగరవి, వీరేశం, స్వామి, కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిల్డర్‌ను డబ్బుల కోసం వేధించిన కార్పొరేటర్ భర్తపై కేసు

కోల్‌సిటీ, ఆగస్టు 13: భవన నిర్మాణం చేసుకోవాలంటే తనకు డబ్బులు ఇవ్వాలంటూ బిల్డర్‌ను వేధించి, బ్లాక్ మెయిల్ చేశాడనే ఫిర్యాదుపై రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత భర్త నగునూరి రాజుపై గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు అయ్యింది. చంద్రబాబుకాల నీకి చెందిన ఓదెల జయేందర్ అనే బిల్డర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నగునూరి రాజుపై బీఎన్ఎస్ సెక్షన్ 308(2), 351(3) క్రింద కేసు నమోదు చేశారు. ఈ నెల 7వ తేదిన కేసు నమోదు కాగా విచారణకు రావాల్సిందిగా నోటీసు ఇచ్చేందుకు అతడు అందుబాటులో లేకపోవడంతో మంగళవారం అతని ఇంటికి నోటీసు అంటించినట్టు వన్‌టౌన్ ఎస్ఐ లింగంపల్లి భూమేష్ తెలిపారు. కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. చంద్రబాబుకాలనీకి చెందిన ఓదెల జయేందర్ పద్మావతి కాలనీలో ఇండ్లు నిర్మిస్తున్నాడు. ఇంటికి రూ.40వేలు ఇవ్వాలంటూ రాజు తనపై ఒత్తిడి తేగా రూ.20వేలు యూపీఐ ద్వారా ఇచ్చినట్టు పేర్కొన్నారు. డబ్బులు పంపానని అతను చెప్పగా మరో రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడని, లేకపోతే పనులు ఆపేస్తానంటూ బెదిరించినట్టు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నేత్రదానం

రామగిరి, ఆగస్టు 13: మండలంలోని రాజాపూర్, కల్వచర్ల గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలు నేత్రదానాలకు ముందుకు వచ్చాయి. మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో సదాశయ ఫౌండేషన్ మంగళవారం నేత్ర శుక్లాలను సేకరించారు. రాజాపూర్, కల్వచర్ల గ్రామాలకు చెందిన బుగ్గే కొమురక్క, కూర సదానందం(సతీష్) వివిధ కారణాలతో మృతిచెందగా బాధిత కుటుంబాలు అనుమతితో నేత్ర శుక్లాలను సేకరించారు. వీరితో పాటు మరింత మంది నేత్రదానాలకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, లైన్స్‌క్లబ్ ఆఫ్ కమాన్‌పూర్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, నూకరమేశ్, చంద్రమౌళి, భీష్మాచారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ఎలిగేడు, ఆగస్టు 13: మండలంలోని ధూళికట్ట, శివపల్లి గ్రామాల్లో మంగళవారం ఇంటింటా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించి ఫీవర్ సర్వే చేశారు. శివపల్లిలో 43మందిని పరీక్షించి 9మందికి పైగా వైరల్ ఫీవర్‌గా గుర్తించారు. ధూళికట్టలో 57మందికి డెంగ్యూ, మలేరియా పరీక్షలు నిర్వహించి అందులో 16మందికి తీవ్ర జ్వరం ఉన్నట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు. వర్షకాలం సీజన్‌లో పరిస్థితులకు అనుకూలంగా ఇంటింటా సుచి, శుభ్రతను పాటించాలని డాక్టర్ నిస్సిక్రిష్టాన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఎంఎల్‌హెచ్ పి.వినయ, సిహెచ్‌వో విజేందర్‌రాజు, సూపర్‌వైజర్ నాగమణి ఏఎన్ఎంలు అమృత, శిరీష, ఆశాలు రాధికాలక్ష్మి, ప్రేమలత, స్వరూప, శారద, స్వప్న, సంధ్య, కళావతి, లత, ఆశాలు, జీపీ కార్యదర్శి పాల్గొన్నారు.

బదిలీలు చేపట్టాలని 'ఆదర్శ' ఉపాధ్యాయుల నిరసన


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 13: మాకు బదిలీలు కావాలని భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు ప్లకార్డులతో మంగళవారం పాఠశాల ముందు నిరసన తెలిపారు. 11 సంవత్సరాలుగా ఒకే పాఠశాలలో పనిచేస్తున్నామని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, 010 పద్ధతి కింద జీతాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఎండి షాదుల్, రమేష్, సుజాత, ప్రసాద్, కుటుంబరావు, చంద్రమోహన్, సుమలత, సునీత, కిరణ్, సందీప్ పాల్గొన్నారు.

స్కావెంజర్లను విధుల్లోకి తీసుకోవాలి

ఎలిగేడు, ఆగస్టు 13: ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసిన స్కావెంజర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల (పారిశుధ్య) కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి నారాయణ, గౌరవ అధ్యక్షుడు జాలిగాం లింగయ్య, ప్రధాన కార్యదర్శి నేరుపట్ల సరిత మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారిణికి వినతిపత్రం సమర్పించారు. కరోనా అనంతరం మళ్లీ విధుల్లోకి తీసుకోలేదని చెప్పారు. ప్రభుత్వం పునరాలోచించి తిరిగి స్కావెంజర్లను విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు.

'చిన్నారులకు ఆపద వస్తే 1098కి కాల్ చేయాలి'

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 13: చిన్నారులకు ఆపద వస్తే 1098 కాల్ చేస్తే తక్షణమే స్పందిస్తారని చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ సతీష్ అన్నారు. మంగళవారం మండలంలోని నిట్టూరు జిల్లా పరిషత్ పాఠశాలలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098పై పిల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలకు బాల్య వివాహాలు, బాల కార్మికులు, బడి బయటి పిల్లలు, తప్పిపోయిన పిల్లలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. గౌరెడ్డిపేట మండల పరిషత్ పాఠశాలలో పెద్దపల్లి జిల్లా మహిళ సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సుచరిత, స్వప్న, ఏపీఎం సంపత్, పాఠశాల హెచ్‌ఎం సమీ, భారతీ, శోభరాణి, స్వరూప, హుస్సేన్, సతీష్, కవిత, వసంత, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాలకు అధికారులే బాధ్యత వహించాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 13: కోల్‌కారిడార్ రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలకు ఆర్జీ-2 సింగరేణి అధికారులే బాధ్యత వహించాలని, అధికారుల నిర్లక్షం కారణంగా కార్మిక కుటుంబాలు ప్రమాదాల బారినపడుతున్నట్టు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సొప్పదండి దుర్గాప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధ ంగా వీర్లపల్లె వద్ద స్పీడ్ బ్రేకర్లు కార్మిక కుటుంబాల ప్రాణాల మీదకు తెస్తున్నట్టు తెలిపారు. రెండు రోజుల క్రితం ఓసీపీ-3 కార్మికుడు కుటుంబంతో గోదావరిఖనికి వెళ్ళి వస్తుండగా స్పీడ్ బ్రేకర్ల దాటే సమయంలో కార్మికుడి భార్య రొంటాల సౌందర్య కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయిని, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందం బాధాకరమైన విషయమని తెలిపారు. రద్దీగా ఉండే కోల్‌కారిడార్ రోడ్డు నిర్వహణను అధికారులు గాలికి వదిలేయడంతో అనేక ప్రమాదాలు జరిగాయని, డ్యూటీలకు వెళ్ళి వచ్చే క్రమంలో ప్రమాదాల కారణంగా కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నట్టు పేర్కొన్నారు. స్పీడ్ బ్రేకర్ పరిమితికి మించి వేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు.

ఆర్జీ-2 ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీ-2 ఏరియా ఉత్తమ కార్మికులను యాజమాన్యం ఎంపిక చేసింది. ఏరియా నుండి ఉత్త మ ఉద్యోగిగా ఎంపికైన సల్ల భిక్షపతి(ఈపీ ఆపరేటర్, ఓసీపీ-3) కొత్తగూడెంలో జరిగే ప్రధాన ఉత్సవంలో సన్మానం పొందనున్నారు. ఏరియా పరిధిలో అయిరెడ్డి సంపత్‌రెడ్డి(ఫిట్టర్, ఓసీపీ-3), జల్లి వెంకటేష్(మెకానికల్ ఫోర్‌మెన్, ఓసీపీ-3), కూచిపూడి రాంబాబు(షటిల్ కార్‌ఆపరేటర్, వీకేపీ గని), మేడగోని బుచ్చిరాజం(వీకేపీ గని), సంకే రాజయ్య(కన్వేయర్ ఆపరేటర్, సీహెచ్‌పీ)లు ఎంపిక అయ్యారు. వీరిని ఆర్జీ-2 ఏరియాలో జరిగే స్వతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జీఎం సన్మానించున్నారు.

ఆర్జీ-3 అధికారులకు వీడ్కోలు సత్కారం

రామగిరి, ఆగస్టు 13: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలో పనిచేసి ఆర్జీ-1కు బదిలీపై వెళ్తున్న పర్సనల్ అధికారి రవీందర్‌రెడ్డి, ఎస్ఎస్‌వో లక్ష్మీనారయణను ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు శాలువ, పూలదండలతో సత్కారించారు. కార్యక్రమంలో అధికారులు రఘుపతి, సత్యనారాయణ, వెంకటరమణ, చంద్రశేఖర్, నాగేశ్వర్‌రావు, కొల శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న డైరెక్టర్ (పా, ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్

గోదావరిఖని, ఆగస్టు 13: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డైరెక్టర్ (పా, ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్ అన్నారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమం మంగళవారం ఆర్‌జీ-1 ఏరియాలో నిర్వహించారు. స్థానిక జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి డైరెక్టర్ (పా, ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్ హాజరై ఆర్‌జీ-1, 2, 3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాల ఉద్యోగులు, అధికారుల సమస్యల పరిష్కారం కొరకై గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ (పా, ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్ ఆర్‌జీ-1 ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన ఇన్సెంటివ్, అనారోగ్య సమస్యలు, బేసిక్, క్వార్టర్ సమస్యలు, ట్రాన్స్‌ఫర్, ఇంక్రిమెంట్ తదితర సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి వారితో స్వయంగా మాట్లాడారు. వారి సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారం చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌జీ-1 ఏరియా జీఎం, నోడల్ ఆఫీసర్ డీ లలిత్ కుమార్, ఆర్‌జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, ఆర్‌జీ-3 జీఎం సుధాకర్‌రావు, అడ్రియాల జీఎం వెంకటేశ్వర్లు, పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, సీనియర్ పీఓ శ్రావణ్ కుమార్, ఆంజనేయులు, కిరణ్‌రాజ్‌కుమార్, రామగుండం రీజియన్ అధికారులు పాల్గొన్నారు.

● ఓసీపీ-3ని సందర్శించిన డైరెక్టర్(పా)

యైటింక్లయిన్‌కాలనీ: ఓసీపీ-3 ప్రాజెక్టును మంగళవారం డైరెక్టర్(పా, ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్ సందర్శించారు. ప్రాజెక్టులోని పనిస్థలాలను పరిశీలించి, వర్షాలతో ఉత్పత్తికి ఆటంకం ఏర్పడకుండా తీసుకుంటున్న చర్యలను తనిఖీ చేశారు. అనంతరం ఉత్పత్తి, రవాణా, వానలపై ప్రాజెక్టు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుకు కేటాయించిన రోజు వారి లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం 7ఎల్ఈపీ గనిలో సాండ్ స్టవింగ్ బంకర్‌ను పరిశీలించారు. డైరెక్టర్ వెంట జీఎం సూర్యనారాయణ, పీఓ మధుసూదన్, ఎస్వోటూ జీఎం వెంకటేశ్వరరావు, అధికారులు నర్సింగరావు, నీలేష్ మహేందర్, షరీఫ్ మహమ్మద్ ఉన్నారు.

ఏఎల్‌పీలో ఏఐటీయూసీ గేట్ మీటింగ్

రామగిరి, ఆగస్టు 13: సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో మంగళవారం ఏఐటీయుసీ గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయుసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లాభాల వాటా వార్షిక టర్నోవర్‌ను త్వరలో ప్రకటించడానికి యాజమాన్యంతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఎస్‌డీఎల్ అండ్‌ఎల్‌హెచ్‌డీలు కొత్త మిషనరీని త్వరలో అన్ని బావుల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సర్వీసు పోస్టులను త్వరలోనే ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో నాయకులు వైవీ రావు, జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, ప్రకాశ్, బుర్ర తిరుపతి, సమ్మయ్య, కుమార్ పాల్గొన్నారు.


గేట్‌మిటింగ్‌లో మాట్లాడుతున్న నాయకులు

పెండింగ్ ప్రమోషన్లు ఇవ్వాలని ఆపరేటర్ల వినతి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 13: 2021 సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ ఈపీ ఆపరేటర్లు మంగళవారం ఆర్జీ-2 అధికార ప్రతినిధికి వినతిపత్రాన్ని అందజేశారు. 2017 నోటిఫికేషన్ ద్వారా ఈపీ ఆపరేటర్లు గా నియమితులైన తమకు డీ గ్రేడ్ ఇచ్చినట్టు తెలిపారు.

2021 సెప్టెంబరులో సీ గ్రేడ్ ప్రమోషన్లు ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటి వరకు ప్రమోషన్లు ఇవ్వలేదని తెలిపారు. 2017 నోటిఫికేషన్ ద్వారా ఈపీ ఆపరేటర్లుగా ఎంపికై ఇతర ఏరియాల్లో పనిచేస్తున్న వారికి సీ గ్రేడ్ ప్రమోషన్లు వచ్చాయని, ఈఏడాది సెప్టెంబరులో బీ గ్రేడ్ ప్రమోషన్లు పొందనున్నట్టు తెలిపారు. అధికారులకు విన్నవించుకున్నా ప్రమోషన్లు ఇవ్వడంలేదని, దీంతో ఆర్థికంగా నష్టపోవడంతో పాటు బదిలీలు, క్వార్టర్ల కౌన్సిలింగ్‌లో తమకు అన్యాయం జరుగుతున్నట్టు డీజీఎంకు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి తమకు రావాల్సిన ప్రమోషన్లు ఇప్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మల్లేష్, శ్రీనివాస్, సాగర్, జంపన్న, సత్యనారాయణ, రాజశేఖర్‌రెడ్డి, క్రాంతి ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



నిట్టూరు జిల్లా పరిషత్ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 13: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. మంగళవారం కాలనీలో సీపీఐ కమాన్‌పూర్ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం జరిగింది. తెలంగాణలో నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపి ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాన్ని ఎన్నుకున్నామనే భావనలో ప్రజలు ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా హామీల అమలు కాలేదని అన్నారు. ప్రజల సంక్షేమం కన్నా రాజకీయాలు ముఖ్యమనే ధోరణిలో ప్రభుత్వ పెద్దల వ్యవహారం ఉన్నదని ఆరోపించారు. పేదలకు తెల్ల రేషన్‌కార్డులు ఇవ్వాలని, వృద్ధులు, దివ్యాంగుల పింఛన్లు ఇవ్వాలని, ధరణిని సరిదిద్దాలని డిమాండ్ చేశారు. సీపీఐ ప్రజల పక్షాన సమస్యల పరిష్కారానికి పోరాడుతుందని అన్నారు. ఈసమావేశంలో మండల పార్టీ కన్వీనర్‌గా రాజారత్నం, కోకన్వీనర్‌గా రాజన్నలను ఎన్నుకున్నారు. ఈసమావేశంలో గౌతంగోవర్ధన్, ఎల్ ప్రకాష్, జాడి ఆంజనేయులు, రామ్మూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.